సాక్షి కర్నూలు

శుక్రవారం | 16 | ఫిబ్రవరి | 2024



మార్చి 3న పల్స్ పోలియో

మద్దికెర: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చి 3న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు 4, 5వ తేదీల్లో వేస్తారన్నారు.



కమనీయం.. కల్యాణోత్సవం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



చిన్నారులకు నాణ్యమైన భోజనం

కోవెలకుంట్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్‌జేఎస్‌కే నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్ సూచించారు. గురువారం కలుగొట్ల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

జగనన్న విద్యా దీవెనకు ఉమ్మడి బ్యాంకు ఖాతా తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు విద్యార్థులు తల్లితో ఉమ్మడి బ్యాంకు ఖాతా చేయించాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి తెలిపారు. గురువారం ఆమె తన ఛాంబర్ నుంచి జిల్లాలోని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, హెచ్‌డబ్ల్యూఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు ఇంకా 2,691 మంది విద్యార్థులు ఉమ్మడి బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయలేదన్నారు. అలాగే 2,551 మంది విద్యార్థులకు సంబంధించి 5-స్టెప్ వెరిఫికేషన్ కూడా ఆయా సచివాలయాల్లో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ రెండు అంశాలపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపించి ఈ నెల 20లోగా పెండింగ్‌ను క్లియర్ చేయాలన్నారు. అలాగే ఇంకా 262 మంది విద్యార్థుల బ్యాంకు అకౌంట్లు ఎన్‌పీసీఐకి అనుసంధానం చేయించాల్సి ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న వాము

- గరిష్ట ధర రూ.25,555

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వాము పోటెత్తుతోంది. క్రయవిక్రయాలకు కర్నూలు మార్కెట్ మాత్రమే ఆధారం కావడం విశేషం. అందువల్ల రోజుకు 2వేల క్వింటాళ్ల వరకు వస్తోంది. ఒక్క శనివారం మినహా మిగిలిన అన్ని పని దినాల్లో మార్కెట్‌లో వాము క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. వాముకు ధర కూడా ఆశాజనకంగా ఉంటోంది. గురువారం వాముకు మంచి ధరలు లభించాయి. కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.25,555 లభించింది. సగటు ధర రూ.18,899 నమోదైంది.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌లో ముగ్గురికి చోటు



కర్నాటి పుల్లారెడ్డి



హనుమంత రెడ్డి



ఎస్‌కే షాషావలి

కర్నూలు(లీగల్):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్‌లో కర్నూలుకు చెందిన ముగ్గురికి చోటు కల్పిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర న్యాయ విభాగం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర కమిటీలో ప్రధాన కార్యదర్శిగా కర్నాటి పుల్లారెడ్డి, కార్యదర్శిగా ఎస్.హనుమంతరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎస్.కె. షాషావలిని నియమించారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.

ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ నాయక్

కర్నూలు టౌన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నూలు జిల్లాకు చెందిన సుగాలి వెంకటేష్ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అలాగే జిల్లాకు చెందిన నీనావత్ శ్రీనివాసులు నాయక్‌ను పార్టీ ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా, సమీర్ అలీఖాన్‌ను సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి ఉద్యోగుల స్పందన రద్దు

కర్నూలు(సెంట్రల్): కొన్ని అనివార్య కారణాలతో ప్రతి నెల 3వ శుక్రవారం నిర్వహించాల్సిన ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించాలని ఆయన కోరారు.

50 శాతం డిస్కౌంట్‌తో చేనేత వస్త్రాల విక్రయాలు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న మహా శివరాత్రి, ఉగాది పండుగల నేపథ్యంలో ఎంపిక చేసిన చేనేత వస్త్రాల కొనుగోలుపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో డివిజనల్ మేనేజర్ పి.భారతి తెలిపారు. కర్నూలు నగరంలో 4, నంద్యాల, శ్రీశైలం, ఎమ్మిగనూరు, ఆదోనిల్లో ఒక్కొక్కటి ప్రకారం మొత్తం 8 ఆప్కో చేనేత వస్త్రాల విక్రయ కేంద్రాలు ఉన్నాయని, వీటన్నిటిలో 50 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందన్నారు. రాజమండ్రి, బందరు, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ చేనేత చీరలు, షర్టింగ్స్, ధోవతులు, టువాళ్లు, బెడ్‌షీట్ తదితరాలన్నీ విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. చేనేత పరిశ్రమను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వివరాలకు 90005 51568 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

శభాష్.. వలంటీర్

మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు.. నడవలేని వృద్ధులకు.. దిక్కు లేని అవ్వాతాతలకు వలంటీర్లే పెద్ద దిక్కుగా మారుతున్నారు. ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారు జామునే పింఛన్ సొమ్ము అందించి ఆసరాగా నిలుస్తున్నారు. కరోనా కష్టకాలంలో సైతం సొంత కుటుంబ సభ్యులు పట్టించుకోకపోయినా వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని ప్రజల దరికి చేర్చేందుకు సైన్యంలా పని చేస్తున్నారు. అందుకే వారు చేస్తున్న సేవలకు గుర్తింపు కల్పించి మరింత ముందుకు నడిపించేందుకు ప్రభుత్వం ఏటా 'వలంటీర్లకు వందనం' పేరుతో సత్కరిస్తోంది.

- ఉత్తమ సేవలు అందించిన వారికి సత్కారం
- జిల్లాలో సన్మానం అందుకోనున్న 10,070 మంది వలంటీర్లు
- మండలాలకు చేరిన సర్టిఫికెట్లు, శాలువాలు, బ్యాడ్జీలు, మెడల్స్
- సేవా వజ్ర అవార్డుకు 37 మంది ఎంపిక
- 159 మందికి సేవా రత్న, 9,874 మంది సేవామిత్ర అవార్డుల ప్రదానం



కర్నూలులో వలంటీర్ల వందనం కార్యక్రమానికి హాజరైన వార్డు, గ్రామ సచివాలయ వలంటీర్లు

కర్నూలు(అర్బన్): ఉత్తమ సేవలు అందించిన గ్రామ, వార్డు వలంటీర్లకు అవార్డులు అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తోంది. గురువారం ఈ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు అందజేయడంతోపాటు ప్రోత్సాహకంగా నగదును అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఇస్తున్న నగదు పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం మరింత పెంచింది. సేవా మిత్రలుగా ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు, సేవా రత్నకు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు, సేవా వజ్రగా ఎంపికైన వారికి రూ.30 వేల నుంచి రూ.45 వేలకు నగదు బహుమతిని పెంచారు. ఈ నగదుతో పాటు ఎంపికైన వలంటీర్లందరికీ ప్రశంసా పత్రం, శాలువా, బ్యాడ్జీ, మెడల్స్‌ను అందించనున్నారు. ఇప్పటికే ఈ మెటీరియల్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలకు చేరింది.

వలంటీర్లదే కీలక పాత్ర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైనవారికి చేరవేయడంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను జిల్లాలోని అన్ని మండలాల్లో సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలతో పాటు 25 మండలాల్లో మొత్తం 10,070 మంది గ్రామ, వార్డు వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వీరిలో అత్యుత్తమ సేవలు అందించిన 37 మంది సేవా వజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే 159 మంది సేవారత్న, 9,874 మంది సేవామిత్రలుగా ఎంపికయ్యారు. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ. 16.65 లక్షలు, సేవా రత్నలకు రూ.47.70 లక్షలు, సేవా మిత్రలకు మొత్తం రూ.14,81,10,000 నగదు పురస్కారంగా అందించనున్నారు.

నియోజకవర్గాల వారీగా అవార్డులకు ఎంపికైన వలంటీర్ల వివరాలు..

అసెంబ్లీ	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర	మొత్తం
ఆదోని	1,058	10	05	1073
ఆలూరు	1,348	30	05	1383
కోడుమూరు	1,144	25	05	1174
కర్నూలు	1,294	09	05	1308
మంత్రాలయం	1,071	20	05	1096
పాణ్యం	1,322	20	02	1344
పత్తికొండ	1,280	25	05	1310
ఎమ్మిగనూరు	1,357	20	05	1382
మొత్తం	9,874	159	37	10,070


వారం రోజుల పాటు కార్యక్రమాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా స్థాయిలో కూడా వలంటీర్లకు వందనం కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగనుంది. గురువారం కర్నూలు నగరంలో వలంటీర్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



మద్దికెర మండలంలోని ఎం. అగ్రహారం గ్రామ సచివాలయం

అవ్వాతాతల ఆనందమే స్ఫూర్తి



ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే పెన్షన్ అందిస్తున్నప్పుడు అవ్వాతాతల కళ్లల్లో కనిపించే ఆనందమే మాకు స్ఫూర్తి. నేను అందించిన సేవలకు గుర్తుగా సేవా వజ్ర పురస్కారం అందుకుంటున్నందుకు చాలా గర్వంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– గొల్ల వెంకటేష్, బుధవారపేట, 33 వ వార్డు సచివాలయం

పేదలకు సేవ చేయడం అదృష్టం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో పేదలకు సేవ చేసే అదృష్టం కలిగింది. ప్రభుత్వ పథకాల వివరాలను అర్హులకు తెలియజెప్పి వారికి ఆ పథకాలను వర్తింపజేయడం చాలా తృప్తిగా ఉంది. నేను చేసిన సేవలకు సేవా రత్న అవార్డు, నగదు ప్రోత్సాహకం అందుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చింది.

– టి.సరస్వతి, ఏపీహెచ్‌బీ కాలనీ, 46వ వార్డు సచివాలయం

కరోనాలో సైతం సేవలు



వలంటీర్‌గా నా పరిధిలోని కుటుంబాలకు కరోనా కష్టకాలంలో కూడా సేవలు అందించా. ఇలాంటి అదృష్టాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నా. నేను అందించిన సేవలకు సేవా మిత్ర అవార్డు ఇచ్చారు.

– బెస్త నాగలక్ష్మి, కాళికమ్మ వీధి, 18వ వార్డు సచివాలయం

నిస్వార్థ సేవా సైనికులు వలంటీర్లు

వలంటీర్లు నిస్వార్థ సేవాసైనికులని రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు అందిస్తున్నారన్నారు. వారి సేవలను మరింత మెరుగు పరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలను అందిస్తోందన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉత్తమ సేవలు అందించిన గ్రామ, వార్డు వలంటీర్లకు మూడు విభాగాల్లో పురస్కారాలను అందించారు. ముందుగా గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల వద్దకు వలంటీర్లు తీసుకెళ్తున్నారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎవరిని గుర్తు పెట్టుకోకపోయినా వలంటీర్లను కచ్చితంగా గుర్తు పెట్టుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కూడా వలంటీర్లు ఎంతో కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. వలంటీర్లు అందిస్తున్న సేవలతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.



వలంటీర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నేటి నుంచి మహా కుంభాభిషేకం



శ్రీశైల మల్లికార్జున స్వామివారికి కుంభాభిషేకం కోసం చేసిన ఏర్పాట్లు

- సాయంత్రం మహాకుంభాభిషేకానికి అంకురార్పణ
- 21 వరకు క్రతువులు
- చివరి రోజు శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్టాపన, కుంభాభిషేకం
- ఏర్పాట్లు సిద్ధం చేసిన దేవస్థాన అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం నుంచి ఈ నెల 21 వరకు మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను దేవస్థాన అధికారులు సిద్ధం చేశారు. ప్రధానాలయంలో శివాజీ గోపుర పునర్నిర్మాణం, ఆలయ ప్రాంగణంలోని కొన్ని ఉపాలయాల పునరుద్ధరణ, పంచమఠాలలోని మూడు మఠాల పునరుద్ధరణ, ఆయా ఉపాలయాలలో, మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ట సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు.

నేడు అంకురార్పణ

శుక్రవారం ఉదయం 7 గంటలకు మహాకుంభాభిషేక సంకల్పం, గోపూజ, గణపతిపూజ, ఋత్విగ్వరణం, దీక్షాధారణ, పర్యగ్నికరణం, యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, మండపారాధనలు,మూలమంత్రానుష్ఠానాలు, పారాయణలు, అఖండ దీపస్థాపన ఉంటుంది. సాయంత్రం 4.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, దేవతాహవనములు, వేదహవనములు, జలాధివాసం, వేదస్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహిస్తారు.

ప్రతిరోజూ నిత్య పూజలు

మహాకుంభాభిషేకం అంకురార్పణ క్రతువులు జరిపిన అనంతరం శనివారం నుంచి ఈ నెల 20వ తేది వరకు ప్రతిరోజు గోపూజ, మండపపూజలు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయణలు, హోమములు, వేదహవనములు, వేదస్వస్తి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

21న శివాజీగోపుర సువర్ణ కలశ ప్రతిష్ఠాపన

మహాకుంభాభిషేకంలో భాగంగా ఈ నెల 21న ఉదయం 7గంటలకు శాంతిహోమం, పౌష్టికహోమం, మహాపూర్ణాహుతి జరిపిస్తారు. ఉదయం 8.45గంటల నుంచి పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠ, శివలింగ నందీశ్వర ప్రతిష్ఠలు, శివాజీగోపురమునకు సువర్ణ కలశ ప్రతిష్ఠలు జరిపిస్తారు. అనంతరం 9.45 గంటలకు ఉభయ ఆలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూలమూర్తులకు, ఇతర దేవతా మూర్తులకు మహాకుంభాభిషేకం జరిపిస్తారు. అనంతరం అవబృథం, గురువందనం, మహాదాశీర్వచనం, వేద సభ నిర్వహించనున్నారు.

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం





ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెబుతున్న ముఖ్యమంత్రి, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే మనువడి వివాహానికి సీఎం హాజరు
- వధూవరులకు ఆశీర్వాదం
- సీఎంను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

కర్నూలు(టౌన్): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి మనువడు పవన్ కళ్యాణ్ రెడ్డి వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం లభించింది. తమ అభిమాన నేతను చూసేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. జై జగన్ అంటూ నినాదాలను హోరెత్తించారు. గురువారం ఉదయం 11.26 గంటలకు కర్నూలు నగర శివారులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రజలకు అభివాదం చేస్తూ ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. నూతన వధూవరులైన పవన్ కళ్యాణ్ రెడ్డి, కీర్తన రెడ్డిని ఆశీర్వదించారు. వేదిక మీద ఉన్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డిని, ఆయన కుమారుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పేరు పేరున పలకరించారు. వారందరితో ఫొటోలు దిగారు. ఫంక్షన్ హాలులో నుంచి వేదిక పైకి వచ్చినప్పుడు పలువురు సీఎంతో కరచాలనం చేసేందుకు ప్రయత్నించారు. తిరుగు ప్రయాణంలో ఫంక్షన్ హాలు నుంచి బయటకు వచ్చి కారులో వెళ్తున్న సీఎంను చూసిన ప్రజలు, అభిమానులు జై జగన్ అంటూ నినదించారు. తన కారును ఆపి సీఎం వాహనం నుంచి బయటకు వచ్చి అందరికీ అభివాదం చేస్తూ బయలు దేరారు.

సీఎంను కలసిన ప్రజాప్రతినిధులు

ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద, కర్నూలు నగర శివారులోని పెద్దపాడు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, మధుసూదన్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, జిల్లా జగనన్న సచివాలయాల కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, మాజీ పార్లమెంటు సభ్యులు బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు సీఎంను కలసిన వారిలో ఉన్నారు.

పత్తికొండ యార్డు అభివృద్ధికి చర్యలు

పత్తికొండ రూరల్ : పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన యార్డు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పశువుల విక్రయం ద్వారా వచ్చే ఆదాయం గురించి తెలుసుకున్నారు. అనంతరం యార్డులో రైతులతో మాట్లాడి టమాటా ధరలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈయన వెంట యార్డు సెక్రటరీ కార్నలీస్ ఉన్నారు.

18న రాప్తాడులో 'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): అనంతపురం జిల్లా రాప్తాడులో ఈ నెల 18వ తేదీన నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాప్తాడు సిద్ధం సభలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికలకు సంబంధించి మ్యానిఫెస్టోను ప్రకటిస్తారన్నారు. చంద్రబాబు పెత్తందార్ల కోసం పనిచేస్తే, ప్రస్తుత ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. పేదలకు సహాయం చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని విమర్శిస్తున్నారని, ఎల్లో మీడియా సైతం అదే విషయాన్ని పతాక వార్తగా ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ..పేదల సంక్షేమానికి ఏం చేశారో చెప్పాలన్నారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. భీమిలీలో, దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలకు లక్షలాది ప్రజలు తరలి వచ్చారన్నారు. ఈనెల 18న రాప్తాడులో జరిగే సిద్ధం సభకు అంతకంటే రెండింతలు ప్రజలు అధికంగా రావాలన్నారు. తెలుగుదేశం పార్టీ తాజాగా రాజ్యసభలో ఒక్కసీటు కూడా గెలుచుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. తెలంగాణలో పోటీ చేసే దిక్కులేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పుట్టగతులుండవన్నారు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు బాబును నమ్మే పరిస్థితులు లేవన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎప్పుడు ప్రజల గురించి ఆలోచించే నాయకుడు అన్నారు. సిద్ధం సభ విజయవంతం చేద్దామని పిలుపు నిచ్చారు.

క్లుప్తంగా

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు జడ్జి రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి గురువారం జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన శివగణేష్, జగదీష్, షేక్ ఫరూక్ పలు ప్రాంతాల్లో మద్యం తాగి ఈలలు, కేకలు వేస్తూ దారిన పోయే మహిళలను సైగలు చేస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి 5 రోజుల చొప్పున జైలు శిక్షను ఖరారు చేశారు.

తూకాల్లో తేడాలు.. 13 కేసుల నమోదు

- కర్నూలులో తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు



గ్యాస్ సిలిండర్ తూకంలో తేడాను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): తూకాల్లో తేడాలు రావడంతో 13 కేసులు నమోదు చేసినట్లు తూనికలు కొలతల శాఖ అధికారులు తెలిపారు. కర్నూలు నగరంలోని గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ గోడౌన్లు, రైస్‌మిల్లులు, షాపింగ్ మాల్స్‌లో గురువారం నాలుగు జిల్లాలకు చెందిన ఆ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లలో, బియ్యం సంచుల్లో తూకం తక్కువగా రావడం, షాపింగ్ మాల్స్‌లో ప్యాకేజ్ రూల్స్‌ను ఉల్లంఘించడంతో 13 కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో నాలుగు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్స్ ఎం.జిలానీబాషా, ఎం.శ్రీరాములు, పి.సుధాకర్, ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్‌గౌస్, శివశంకర్, వైజీ శంకర్, అనిత, ఖాజా హుస్సేన్, వరప్రసాద్, పరమేశ్వర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో పూచీకత్తు కేసు పరిష్కారం

కర్నూలు(లీగల్): లోక్ అదాలత్‌తో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూచీకత్తు కేసు గురువారం పరిష్కా రం అయ్యింది. లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీ వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లు నడుపుకునేందుకు ఎమ్మిగనూరు ఏపీఎస్పీడీసీఎల్‌కు రూ.1,16,050 పూచీగా చెల్లించి మిల్లు నిర్వాహక భాగస్వామి అయిన జి.సూర్యనారాయణ శెట్టి విద్యుత్ సరఫరా తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైస్‌మిల్లును మూసేసి, పూచీకత్తుగా జమ చేయించుకున్న డబ్బును ఇవ్వాలని విద్యుత్ అధికారులను అభ్యర్థించినప్పటికీ స్పందించలేదు. దీంతో ఈయన శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. అభ్యర్థనను పరిశీలించి పూచీకత్తుగా ఇచ్చిన డబ్బుతోపాటు నష్టపరిహారం కింద రూ.60 వేలు చెల్లించాల్సిందిగా న్యాయవాదులు టి.శివశంకర్‌రెడ్డి డి.రాజుబాబు, బి.మురళి మనోహర్, ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి సమక్షంలో అవార్డు మంజూరు చేసినట్లు లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు.

'హర్షి'ంచేలా!

అతడు చదివింది బీటెక్ కంప్యూటర్ సైన్స్. చేస్తున్నది పాడి పోషణ. చదివిన చదువుకు.. చేస్తున్న పనికీ ఎలాంటి సంబంధం లేనప్పటికీ అందరూ హర్షించేలా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాడు దొర్నిపాడు మండలం అమ్మిరెడ్డినగరం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి. ఇంతింతై వటుడింతై అన్నట్లు తండ్రి చేస్తున్న గేదెల పోషణతో ప్రారంభించి కోళ్లు, మేకలు, పొట్టేళ్ల పెంకంతో బాగా రాణిస్తూ యువతకు రోల్ మోడల్‌గా నిలిచాడు. ఆయన జీవన విధానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – దొర్నిపాడు



పాడి గేదెలతో హర్షవర్ధన్‌రెడ్డి

- చదువు బీటెక్...వృత్తి పాడిపోషణ
- గేదెలు, కోళ్లు, పొట్టేల పెంపకంతో జీవనం
- నెలకు రూ.1.50 లక్షలకు పైగా సంపాదన
- ఆదర్శంగా అమ్మిరెడ్డి నగరం యువకుడి హర్షవర్ధన్



పొలంలో ఏర్పాటు చేసిన షెడ్లు, గడ్డివాములు



ఫాంలో దిట్టంగా ఉన్న పొట్టేళ్లు



రకరకాల కోళ్లు

మారుమూల పల్లెకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి 2018లో బెంగళూరులో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. అతనికి వివిధ కంపెనీల నుంచి ఉద్యోగ అవకాశాలు వచ్చినా తండ్రి ప్రసాద్‌రెడ్డి నమ్ముకున్న పాడిపోషణే చేయాలని నిర్ణయించుకున్నాడు. నెలకు రూ.లక్ష వరకు జీతం ఇస్తామన్నా వెళ్లలేదు. ప్రస్తుతం కంపెనీల ఒత్తిడి, యాజమాన్యాల కింద పనిచేసేందుకు ఇష్టపడని అతడు పాడి పెంపకం వైపు అడుగులు వేసి నెలకు రూ.1.50 లక్షలకు పైగా సంపాదిస్తూ మరో రెండు కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నాడు.

2.75 ఎకరాల్లో పాడిపోషణకు శ్రీకారం

పాడిపెంపకం, వాటికి కావాల్సిన ఆహారం, షెడ్లు, నీటి వసతి తదితర వాటి కోసం 2.75 ఎకరాల పొలాన్ని ఎంచుకున్నాడు. వీటిలో అర ఎకరంలో పాడిగేదెలు, కోళ్లు, మేకలు, పొట్టేళ్లకు కావాల్సిన షెడ్లను వేశారు. మిగతా విస్తీర్ణంలో పశువుల మేత కోసం పచ్చటి గడ్డిని పెంచుతున్నారు. బయట దొరికే మేత ప్రస్తుతం రసాయన మందులు పిచికారీ చేయడంతో మేత విషతుల్యం అవుతుందని వారే ఎలాంటి కల్తీ లేకుండా స్వచ్ఛమైన గడ్డిని పెంచుతున్నారు. పశువుల ఎరువులను మాత్రమే పచ్చిగడ్డి పెంపకానికి వినియోగిస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడనటువంటి గ్రాసాన్ని ఎండబెట్టి వాములుగా వేసి ఆ తర్వాత పశువులకు మేతగా వేస్తున్నారు.

రూ.80 లక్షల వరకు పెట్టుబడి

మొదట షెడ్ల నిర్మాణం, చుట్టూ కంచె చేపట్టి హర్యాణ, బిహార్ నుంచి వివిధ జాతుల గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లను తెచ్చుకున్నారు. వీటికి దాదాపు రూ.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వారి వద్ద 70 గేదెలు, 500 పైగా కోళ్లు, 10 ఆవులు, 150 పొట్టేళ్లు, 30 బ్లాక్ బెంగాల్ జాతి మేకలు ఉన్నాయి. కృత్రిమంగా దొరికే సూదుల ద్వారా సంతానోత్పత్తిని సృష్టించకుండా మగ దున్నలను కూడా పోషిస్తున్నారు.

రోజూ 160 లీటర్ల పాలు

పశుపోషణకు నెలకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. 70 గేదెల్లో ప్రస్తుతం 12 గేదెలు 160 లీటర్ల పాలు ఇస్తున్నాయి. మరో 15 గేదెలు ఈనేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెన్నశాతం బట్టీ లీటరు పాలు రూ.55 చొప్పున విజయ డెయిరీకి విక్రయిస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.8,800 వస్తుంది. అంటే నెలకు సుమారు రూ.2.64 లక్షలు వస్తుంది. అన్ని పెట్టుబడులు పోనూ నెలకు రూ.1.50ల వరకు ఆదాయం వస్తుంది.

పాడి మూత్రం మహా ప్రియం

సేంద్రియ ఎరువుల వాడకంలో భాగంగా ప్రస్తుతం మార్కెట్లో గేదెల మూత్రానికి భలే గిరాకీ ఉంది. లీటరు రూ.10 నుంచి రూ.15 కొనుగోలు చేస్తున్నారు. షెడ్డులో గేదెల మూత్రం అంతా ఒకే చోటకు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ వందల లీటర్ల మూత్రం వారికి ఆదాయ వనరుగా మారి ఇతర పెట్టుబడులకు ఉపయోగపడుతోంది.

తన మూడు పిల్లలతో బ్లాక్ బెంగాల్ జాతి మేక



- ఇక్కడ కనిపిస్తున్న పొట్టి మేక బ్లాక్ బెంగాల్ జాతికి చెందింది. మామూలు మేకలు ఏడాదిలో ఒక సారి మాత్రమే అదికూడా ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తాయి. ఇది మాత్రం ప్రతి ఈతలో మూడు పిల్లల చొప్పున రెండు సార్లు ఈనుతుంది. ఇలాంటి జాతి మేకలు 15 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 90 పిల్లలు జన్మిస్తున్నాయి. ఒక్కో మేక బరువును బట్టి రూ.7వేల నుంచి రూ.12 వేల వరకు ధర పలుకుతోంది.

మూడేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం



నాతో పాటు మరో కుటుంబం ఇక్కడే నివాసం ఉంటున్నాం. నెలకు రూ.30 వేలు, మరో వ్యక్తికి రూ.20 వేలు ప్రతి నెలా జీతం ఇస్తారు. పశువులకు స్నానం, మేత, షెడ్డు పరిశుభ్రత, పాలు పితకడం పనులను చేయాల్సి ఉంది. మాకు పాడి పోషణలో అధికంగా మా ప్రాంత వాసులకు అనుభవం ఉండటంతో మూడేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. నివాసానికి కావాల్సిన వసతులను ఏర్పాటు చేశారు.

– ధర్మేంధర్, బిహార్ వాసి

స్వచ్ఛమైన పాలను అందించడమే లక్ష్యం



ప్రస్తుతం మార్కెట్లో అధికంగా కల్తీ పాలే. స్వచ్ఛమైన పాలను వినియోదారులకు అందించడమే లక్ష్యంగా పాడిపోషణకు శ్రీకారం చుట్టాను. అందుకు మా నాన్న ప్రసాద్‌రెడ్డి ప్రోత్సాహం మరువలేనిది. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివి మంచిగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకోవచ్చుకదా అని చాలా మంది అన్నారు. అయినా నా పట్టుదలతో నాన్న సుమారు రూ.80 లక్షల వరకు పెట్టుడి పెట్టాడు. ప్రస్తుతం స్వచ్ఛమైన పాలను విజయ డెయిరీకి పోస్తున్నాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, అమ్మిరెడ్డి నగరం

పండుగలతో సద్భావన



అనుగ్రహ భాషణం చేస్తున్న సచ్చిదానంద స్వామి

కర్నూలు కల్చరల్: పండుగలతో సద్భావన సిద్ధిస్తుందని సద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. గురువారం నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయం పంచమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. పండుగలతో మన ఆచార వ్యవహారాలు తెలుస్తాయన్నారు. పిల్లలకు పండుగల పరమార్థాన్ని వివరించాలన్నారు. తల్లిదండ్రుల వ్యక్తిత్వాన్ని బట్టే పిల్లల వ్యక్తిత్వం ఉంటుందన్నారు. అమెరికాలోని పలు ప్రాంతాల్లో మన ఆలయాలు ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తున్నారన్నారు. కర్నూలులోని సూర్యాలయం దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట దేశంలో ఐక్యతను తెచ్చిందన్నారు. అక్కడ జరిగిన అద్భుతం నాస్తికులను సైతం రామా అనేలా చేసిందన్నారు. అంతకు ముందుకు ఆలయంలో శ్రీషణ్ముఖసుబ్రమణ్యేశ్వర స్వామికి అభిషేకం, కావడి సేవలు, పాశుపత హోమాలు జరిగాయి. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీలు శివరామకృష్ణ, డాక్టర్ నగేష్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భజన పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట ఎస్సీ కాలనీలో సీతా రాముల విగ్రహాల ప్రతిష్ఠను పురస్కరించుకొని బుధ వారం రాత్రి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి భజన పోటీలు గురువారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 35 భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా కర్నూలుకు చెందిన రామలింగయ్య, తెలంగాణ నుంచి సోమన్న, రాజబాబు, హైదరాబాదుకు చెందిన సత్తెన్న వ్యవహరించారు. అనంతపురం జిల్లా గుర్రంపాడు, అదే జిల్లా పెద్దవడుగూరుకు చెందిన లక్ష్ముంపల్లె, మరూరు, కూచివారిపల్లె భజన బృందాలు వరుసగా నాలుగు స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు,రూ.15వేల నగదు బహుమతులు అందించారు. దాతల సహకారంతో 23 బహుమతులను భజన బృందాలకు మొత్తం రూ.2.03లక్షల నగదు బహుమతులు అందజేశారు.

బాకీ తీర్చలేదని బాలుడి కిడ్నాప్?

- పాఠశాల వద్ద కారులో ఎక్కించుకుని మైదుకూరు మండలం వనిపెంట అడవిలోకి తీసుకెళ్లిన కిడ్నాపర్లు
- తప్పించుకుని రోడ్డుపైకి పరుగెత్తుకొచ్చిన బాలుడు
- స్థానికలు గమనించి పోలీసులకు అప్పగింత
- పోలీసుల అదుపులో కిడ్నాపర్ ?



కిడ్నాప్‌కు గురైన బాలుడు చక్రి

ఆళ్లగడ్డ: తల్లిదండ్రులు బాకీ తీర్చలేదని కుమారుడిని కిడ్నాప్ చేసిన ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక బొరుగులబట్టి వీధికి చెందిన వెంకటలక్ష్మి.. అదే కాలనీలోని దూరపు బంధువులైన భూదేవి, భూపాల్ దంపతులకు విడతల వారీగా మొత్తం రూ.15 లక్షలు వడ్డీకి ఇచ్చింది. ఈ అప్పు తీర్చమని ఒత్తిడి చేస్తున్నా వారు కాలయాపన చేస్తుండటంతో ఇల్లు రాసి ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయితే ఇల్లు రాసిస్తే తమ కుమారుడికి బతుకు ఏం కావాలని భూదేవి, భూపాల్ దంపతులు అనడంతో కొంతకాలం మిన్నకుండిపోయింది. ఎలాగైనా పిల్లాడిని అడ్డు తొలగిస్తే ఇల్లు రాయించుకోవచ్చని అనుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న భూదేవి, భూపాల్‌ల కుమారుడు చక్రిని బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో కారులో ఎక్కించుకుని మైదుకూరు మండలం వనిపెంట అడవిల్లోకి తీసుకెళ్లారు. హత్య చేయాలని ప్రయత్నిస్తుండగా కొండపై నుంచి బాలుడు జారీ పడి రోడ్డు మీదకు దొర్లుకుంటూ వచ్చాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి జరిగిన విషయం తెలుసుకుని బస్సులో ఎక్కించుకుని మైదుకూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకుళ్లి పోలీసులు అప్పగించారు. వారు విచారించి ఆళ్లగడ్డ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా నిందితులను అదుపులోకి తీసుకుని, వారు ఉపయోగించిన కారును సీజ్ చేయడంతో పాటు తమదైన శైలిలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎల్లార్తిలో స్పెయిన్ దేశస్తుల సందడి

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో స్పెయిన్ దేశస్తులు గురువారం సందడి చేశారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ) ఆధ్వర్యంలో స్పెయిన్ దేశస్తుల సహకారంతో గ్రామంలో దళితులకు 29 నూతన గృహాలు నిర్మించారు. రూ.82.65 లక్షలతో నిర్మించిన ఈగృహాల ప్రారంభోత్సవానికి 30 మంది స్పెయిన్ దేశస్తులు ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. వీరికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి, శిలాఫలకంతో పాటు 29 నూతన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్‌టీ హనుమంతప్ప, సీఓ ఓబులేసు మాట్లాడారు. విద్యార్థులతో కలిసి నృత్యాలు చేస్తున్న స్పెయిన్ దేశస్తులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి నృత్యాలు చేస్తున్న స్పెయిన్ దేశస్తులు

సంక్షేమ పథకాలపై పూర్తి సంతృప్తి

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ఏ మేరకు అమలు అవుతున్నాయో తెలుసుకునేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి గురువారం కర్నూలు మండలంలో పర్యటించారు. రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులతో పథకాలపై సమీక్షించారు. అదే విధంగా పంచలింగాల, ఈ-తాండ్రపాడు గ్రామంలోని సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. పంచలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడి పిల్లలకు అందించే జగనన్న గోరుముద్ద పథకాన్ని సైతం పరిశీలించారు. అనంతరం కర్నూలు మండల సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా నిర్వహిస్తున్న పథకాలపై మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో తమ కుటుంబాల్లో అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. మహిళలకు జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ యస్.సలీంబాషా, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఏపీడీ శ్రీధర్‌రావు, డీపీఎం నర్సమ్మ, కర్నూలు, కల్లూరు మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు అరుణమ్మ, సువర్ణ, ఏపీఎంలు మల్లికార్జున, శ్రీనివాసగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గార్గేయపురం సచివాలయ సిబ్బందితో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

ఎరిగేరిలో పేదలకు అందిన ఇళ్ల స్థలాలు



స్థలాలు చూసుకుంటున్న లబ్ధిదారులు




హద్దురాళ్లు చూపిస్తున్న దృశ్యం

కౌతాళం: టీడీపీ నాయకుల కుట్రలు భగ్నమయ్యాయి. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. కౌతాళం మండల ఎరిగేరి గ్రామ ప్రజలకు ఎట్టకేలకు ఇళ్లస్థలాలు అందాయి. గురువారం రెవెన్యూ అధికారులు స్థలాలను చూపించారు. ఎరిగేరి గ్రామంలోని 299 మంది పేదలకు 2006లో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఇంటి పట్టాలు అందజేశారు. స్థలాల్లో ఇళ్లు కట్టుకోక పోవడంతో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కంపచెట్లను తొలగించి గతంలో ఇచ్చిన లబ్ధిదారులకే స్థలాలు చూపడానికి ప్రయత్నించగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. గురువారం స్థలాలు చూపడానికి సర్వేయర్‌లు రాగా టీడీపీకి చెందిన న్యాయవాది అక్కడకు వచ్చి వాగ్వాదానికి దిగాడు. ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో తమకు స్థలాలు చూపుతుంటే అడ్డుకోవడం తగదంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో న్యాయవాది అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో లబ్ధిదారులందరికీ రెవెన్యూ అధికారులు స్థలాలు చూపించారు. స్థలాలకు హద్దురాళ్లు పాతి నంబర్లు వేయించి ఇవ్వడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

జొన్న రైతుకు మద్దతుతో భరోసా

ముమ్మరంగా జొన్నల కొనుగోళ్లు

- కర్నూలు జిల్లాలో 500, నంద్యాల జిల్లాలో 2వేల టన్నుల కొనుగోళ్లు
- మార్కెట్‌లో జొన్నల ధర రూ.2,600 మాత్రమే
- మద్దతు ధర హైబ్రిడ్ జొన్నలకు రూ.3,180, మలంది జొన్నలకు రూ.3,225



కొనుగోలుకు తీసుకొచ్చిన జొన్నలు

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24లో పండించిన జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేసే ప్రక్రియ ఊపందుకుంది. ప్రజా పంపిణీ కోసం ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతుల నుంచి మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేస్తోంది. హైబ్రిడ్ జొన్నలకు కనీస మద్దతు ధర రూ.3,180, మలంది జొన్నలకు రూ.3,225 ఉంది. మద్దతు ధర మహేంద్ర రకాలకు చెందిన తినే జొన్నలకే వర్తిస్తుంది. మార్కెట్‌లో ప్రస్తుతం జొన్నల ధర రూ.2,600 మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవడం రైతులకు కలిసి వస్తోంది. జొన్న సాగు చేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదై.. ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి జొన్నలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండటం విశేషం. పౌరసరఫరాల సంస్థ తరపున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ జొన్నలను కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు డీసీఎంఎస్ కర్నూలు జిల్లాలో రైతుల నుంచి 500 టన్నులు కొనుగోలు చేయడం విశేషం. రబీలో శనగ తర్వాత జొన్న ప్రధాన పంట. ఆలూరు, హాలహర్వి, హొలగొంద, చిప్పగిరి, పెద్దకడుబూరు, దేవనకొండ, కోసిగి మండలాల్లో జొన్న సాగయింది. కొనుగోలు చేసిన జొన్నలను రానున్న రోజుల్లో ప్రజాపంపిణీ ద్వారా రైస్ కార్డులకు పంపిణీ చేస్తారు. నంద్యాల జిల్లాలో దాదాపు 2వేల టన్నుల వరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆళ్లగడ్డ, నంద్యాల, కోవెలకుంట్ల, బనగానపల్లి ప్రాంతాల్లో జొన్నల కొనుగోలు జోరుగా సాగుతోంది. కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తే జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేయడంలో నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నట్లు సమాచారం. కనీస నాణ్యత ప్రమాణాలు తూ.చ. పాటిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో జొన్నల ధర పడిపోయిన నేపథ్యంలో మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండటం రైతులకు ఎంతో ఊరటనిస్తోంది.

20 టన్నుల కందుల కొనుగోలు

కందులను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు అధికారులు రైతుల దగ్గరకే వెలుతున్నారు. కందులకు మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంది. క్వింటా ధర రూ.10వేలు ఆపైనే ఉంటోంది. దీంతో ప్రభుత్వం కూడా ప్రజాపంపిణీ కోసం మార్కెట్ ధరకు అనుగుణంగా కందుల కొనుగోలుకు చర్యలు తీసుకుంది. పౌరసరఫరాల సంస్థ కందులకు సగటు ధర ఇస్తోంది. ఈ సగటు ధర మార్కెట్ ధర కంటే కాస్త తక్కువగా ఉండటంతో పౌరసరఫరాల సంస్థకు కందులు విక్రయించేందుకు ముందుకు రావడం లేదు. అతి కష్టం మీద పౌరసరఫరాల సంస్థ డీసీఎంఎస్ ద్వారా 20 టన్నుల వరకు కందులు కొనుగోలు చేయడం విశేషం. కందులను మద్దతు ధరతో కందులు కొనుగోలు చేసినపుడు రైతుల బ్యాంకు ఖాతాలకు 21 రోజుల పని దినాల్లో నగదు జమ చేయడం జరిగేది. ఇపుడు 7 పని దినాల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ రంగం సిద్ధం చేసుకుంది. పౌరసరఫరాల సంస్థ మార్కెట్ ధర ప్రకారం కందులు కొనుగోలు చేస్తారు. లెబర్, గన్నీ బ్యాగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా ఉంటాయి.